



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)






Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 139 | శుక్రవారం 19 జూన్ 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


## ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం


2 లో

- మాజీ మంత్రి కారుమూరి కుటుంబానికి
- చెందిన సునీల్‌ను అరెస్ట్ చేసిన ఈడీ..
- కోర్టులో హాజరు
- లిక్కర్ అక్రమాల కేసులో ఈడీ మరో దెబ్బ..
- రూ.195 కోట్ల లిక్కర్ అక్రమాల కేసు..
- ఈడీ దర్యాప్తు వేగం
- ఏపీ లిక్కర్ కేసులో ఈడీ యాక్షన్..
- మాజీ మంత్రి కుటుంబానికి చెందిన సునీల్ అరెస్ట్
- లిక్కర్ రవాణా అక్రమాలపై ఈడీ ఉక్కుపాదం..

## 'కేటీఆర్ వీకెండ్ ఎమ్మెల్యే'..

**సిరిసిల్లలో కవిత విమర్శలు**

**రైతులు, కార్మికుల సమస్యలపై**

**స్పందించలేదని ఆరోపణ..**

**స్వయం ఉపాధికి భారీ రుణాల హామీ**


2 లో

సిరిసిల్ల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్ "వీకెండ్ ఎమ్మెల్యే"లా వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యలపై స్పందించే తీరిక కూడా లేదని ఆరోపించారు.

సిరిసిల్ల పర్యటనలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళు లర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించిన కవిత, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సిరిసిల్లలోని విద్యుత్ సహకార సంస్థ (సెస్) ప్రభుత్వంలో విలీనం అయినప్పటికీ కేటీఆర్ స్పందించలేదని విమర్శించారు. రైతుల కోసం ప్రత్యేక డిస్కం ఏర్పాటు అంశంపైనా ఆయన తన వైఖరిని వెల్లడించలేదని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో అందించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని కవిత ఆరోపించారు.

## 12 ఏళ్లలో నూతన భారత్ ఆవిష్కరణ: ప్రధాని మోడీ

**పారిస్‌లో భారత అభివృద్ధి ప్రస్థానాన్ని వివరించిన ప్రధాని.. జీడీపీ నుంచి డిజిటల్ విప్లవం వరకు కీలక అంశాల ప్రస్తావన**


2 లో

పారిస్: గత 12 సంవత్సరాలు భారతదేశ అభివృద్ధి చరిత్రలో కీలక మలుపుగా నిలిచాయని, 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం, సామర్థ్యం, ఆత్మవిశ్వాసానికి ఈ కాలం ప్రతీకగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో భారతీయ సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, దేశం సాధించిన ఆర్థిక, సామాజిక, సాంకేతిక పురోగతిని వివరిస్తూ భారత్ ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

గత 12 ఏళ్లలో దేశ జీడీపీ రెట్టింపు కావడంతో పాటు విమానాశ్రయాలు, విశ్వవిద్యాలయాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ప్రధాని తెలిపారు. రహదారుల నిర్మాణ వేగం మూడింతలు పెరగగా, మెట్రో రైలు నెట్‌వర్క్ నాలుగింతలు విస్తరించిందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందని చెప్పారు.

## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**డిప్యూటీ సీఎం భట్టి**

**సంక్షేమ పథకాల అమలుకు వేగం.. ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు భారీ ఏర్పాట్లు**


2 లో


హైదరాబాద్: రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

## 'ప్రపంచం సురక్షితం.. చమురు మళ్లీ ప్రవహిస్తోంది'

**ఇరాన్‌పై ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక వ్యాఖ్యలు..**

**అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఆశావహ ప్రకటనలు**

పారిస్/వాషింగ్టన్: అమెరికా-ఇరాన్ అవగాహన ఒప్పందం అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో కీలక వ్యాఖ్యలు చేశారు. చమురు సరఫరాలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయని, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను కలిగి ఉండదని పేర్కొంటూ ప్రపంచం మరింత సురక్షితంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. అమెరికా ఆర్థిక పరిస్థితిపై కూడా ట్రంప్ ఆశావహంగా స్పందించారు. స్టాక్ మార్కెట్లు బలంగా దూసుకుపోతున్నాయని, ఉద్యోగాల సంఖ్య రికార్డు స్థాయిలో ఉందని, ధరలు తగ్గుముఖం పట్టడంతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతోందని తన పోస్టులో పేర్కొన్నారు.


2 లో

# కబ్జాదారుల వీపులు సున్నం చేస్తాం..

# హైడ్రా పేదల జోలికి వెళ్లదు

- ప్రభుత్వ భూముల రక్షణే లక్ష్యం.. గుర్రంగూడ ఎకో పార్క్‌లో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ
- ప్రభుత్వ భూములపై కన్నేస్తే కఠిన చర్యలు..
- హైడ్రా టార్గెట్ కబ్జాదారులే.. పేదలకు భయం అవసరం లేదు
- 424 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాం.. భూకబ్జాలకు చెక్
- దేవుడి భూములనూ వదలట్లేదు.. కబ్జాదారులపై ఉక్కుపాదం
- భూకబ్జాలకు నో.. హైడ్రాతో ప్రభుత్వ ఆస్తుల రక్షణ
- మూసీ పునరుజ్జీవనం నుంచి పచ్చదనం వరకు.. భూకబ్జాలపై సీఎం ఘాటు హెచ్చరిక



హైదరాబాద్, జూన్ 18: ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే "వీపులు సున్నం చేస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. హైడ్రా పేద ప్రజల కోసం కాదు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించే పెద్ద కబ్జాదారులపై చర్యలు తీసుకునేందుకే ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. కొందరు ఉద్దేశపూర్వకంగా హైడ్రాను భూతంలా చిత్రీకరిస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రభుత్వ భూములను రక్షించడమే హైడ్రా ప్రధాన లక్ష్యమని తెలిపారు.

తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావించిన సీఎం, రాజకీయ కుట్రల కారణంగా గతంలో కొడంగల్‌లో ఓడిపోయినా, మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపీగా గెలిపించి తనను నిలబెట్టారని గుర్తుచేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో గత పదేళ్లుగా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గుర్రంగూడ ఎకో పార్కును కూడా కబ్జా చేయాలని ప్రయత్నించారని, అయితే న్యాయపోరాటం చేసి 424 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడగలిగామని వెల్లడించారు.

వనస్థలిపురంలో దేవాదాయ శాఖకు చెందిన భూములను సైతం ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరిగాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ప్రభుత్వ భూములపై కన్నేసిన వారిపై ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. భవిష్యత్తులో సామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే హైడ్రాను రంగంలోకి దింపినట్లు తెలిపారు.

మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుంటే కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ సహా దేశంలోని పలు నగరాలు తీవ్రమైన కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, హైదరాబాద్ అలాంటి పరిస్థితిని ఎదుర్కోకుండా ముందుచూపుతో పచ్చదనాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. నగరాన్ని కాలుష్య రహితంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పునరుద్ఘాటించారు.

## రైతులకు తీపి కబురు.. రైతు భరోసా డబ్బులు పడేది ఆరోజే..



2 లో

తెలంగాణలోని రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అద్భుతమైన తీపి కబురు అందించింది. అన్నదాతలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'రైతు భరోసా' నిధుల విడుదలకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. కేబినెట్ ఆమోదించిన షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 30వ తేదీన అర్హులైన రైతులందరి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా ఈ రైతు భరోసా నిధులను జమ చేయనున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే ఈ నిధులు విడుదల కానుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నిధుల విడుదల కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది.

## ఆర్టీసీ ఉద్యోగులకు 11% ఫిట్‌మెంట్..

- గుర్తింపు సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్
- జూలై 1 నుంచి అమలు.. ఎన్నికల ప్రక్రియ
- ప్రారంభించాలని అధికారులకు మంత్రి పొన్నం ఆదేశం


2 లో

హైదరాబాద్: టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్పీఎస్-2021 ప్రకారం 11 శాతం ఫిట్‌మెంట్‌ను జూలై 1 నుంచి అమలు చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# రైతులకు తీపి కబురు.. రైతు భరోసా డబ్బులు పడేది ఆరోజే..




తెలంగాణలోని రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అద్భుతమైన తీపి కబురు అందించింది. అన్నదాతలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'రైతు భరోసా' నిధుల విడుదలకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. కేబినెట్ ఆమోదించిన షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 30వ తేదీన అర్హులైన రైతులందరి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా ఈ రైతు భరోసా నిధులను జమ చేయనున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే ఈ నిధులు విడుదల కానుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నిధుల విడుదల కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఒక భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు. ఈ సభ వేదిక నుంచే ముఖ్యమంత్రి నేరుగా రైతుల అకౌంట్‌లలోకి డబ్బులను జమ చేసే ప్రక్రియను అధికారికంగా ప్రారంభించనున్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు 11% ఫిట్‌మెంట్..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఈ నిర్ణయాలను వెల్లడించారు. ఉద్యోగి శంకర్ ఆత్మహత్య ఘటన నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఉద్యోగుల విరాళాలతో సేకరించిన రూ.1 కోటి చెక్కును త్వరలో అందజేయడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రమాద బీమా పథకం కింద ఇప్పటికే 11 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలని, విధుల నుంచి తొలగించిన ఉద్యోగుల కేసులను కూడా వేగంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఆర్టీసీ అభివృద్ధిలో భాగంగా 2023-26 మధ్య రూ.1,078 కోట్లతో 2,815 కొత్త బస్సులను కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఏటూరు నాగారం, పెద్దపల్లిలో రెండు కొత్త డిపోలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. సంస్థ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని, సీఎస్ఎస్, పీఎఫ్‌తో పాటు ఇతర బకాయిలను గణనీయంగా తగ్గించగలిగామని చెప్పారు.

ప్రజా రవాణాను మరింత పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,050 ఈవీ బస్సులు నడుస్తున్నాయని, వాటి పనితీరు, లాభనష్టాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బస్ స్టేషన్ల అభివృద్ధి, భూ బదలాయింపు ప్రక్రియలు, మహాలక్ష్మీ పథకం ప్రభావం, మహిళా సంఘాల భాగస్వామ్యంపై కూడా సమీక్ష నిర్వహించారు.

# మళ్లీ చలో జంతర్ మంతర్.. విద్యార్థులు, ప్రజలకు కాక్‌రోచ్ జనతా పార్టీ పిలుపు



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 20న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన, నిరవధిక ధర్నా చేపట్టనున్నట్లు కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ప్రకటించారు. ఈ దేశవ్యాప్త నిరసనకు మరోసారి విద్యార్థులు, తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు, పౌరులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

**48 గంటల్లో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య!**

గత 48 గంటల్లో దేశంలో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు కోల్పోయారని అభిజీత్ దిప్కే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల వరుస మరణాలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడాలని, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్న విద్యాశాఖ మంత్రి వెంటనే తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జూన్ 20న నిర్వహించ తలపెట్టిన ఈ శాంతియుత ధర్నాకు సంబంధించి ఢిల్లీ పోలీసులకు ముందస్తు సమాచారం అందించామని, అవసరమైన అన్ని నిబంధనలను పూర్తి చేశామని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. పోలీసుల నుండి సానుకూల స్పందన వస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల సోషల్ మీడియా వేదికగా ప్రారంభమై, లక్షలాది మంది మద్దతుతో దూసుకుపోతున్న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో ఈ నెలలో ఢిల్లీలో జరుగుతున్న రెండో ప్రధాన నిరసన ఇది. మరోవైపు దేశవ్యాప్తంగా ఇటీవల పలు రాష్ట్రాల్లో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న నిరసనలు తెలిపిన విషయం విదితమే.

# జార్ఖండ్‌లో 'క్రాస్ ఓటింగ్' కలకలం.. బీజేపీ మద్దతుదారుడికి రాజ్యసభ సీటు



జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర ఉత్కంఠ నడుమ జరిగిన ఈ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య క్రాస్ ఓటింగ్జరగడం రాజకీయంగా పెద్ద దుమారం రేపింది. ఇరుపక్షాల నుంచి బలాబలాల సమీకరణాలు మారడంతో, భారతీయ జనతా పార్టీ మద్దతు ప్రకటించిన స్వతంత్ర అభ్యర్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త పరిమళ్ నత్వానీ రాజ్యసభకు ఎన్నికయ్యారు. జార్ఖండ్ అసెంబ్లీలో ఉన్న సీట్ల సంఖ్య ప్రకారం అధికారిక కూటమికి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ, పోలింగ్ సమయంలో కొందరు ఎమ్మెల్యేలు పార్టీ విప్‌ను ధిక్కరించి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లుగా తెలుస్తోంది. బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించి స్వతంత్ర అభ్యర్థి వెనుక తన పూర్తి బలాన్ని నిలపడంతో పాటు, ఇతర పార్టీల అసంతృప్త ఎమ్మెల్యేల మద్దతును కూడగట్టడంలో సక్సస్ అయింది. తాజా గెలుపుతో జార్ఖండ్‌లో అధికార పక్షానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని, రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 12 ఏళ్లలో నూతన భారత్ ఆవిష్కరణ

మొదటి పేజీ తరువాయి

## : ప్రధాని మోడీ

తయారీ, ఎగుమతుల రంగాల్లోనూ దేశం విశేష పురోగతి సాధించిందని మోడీ పేర్కొన్నారు. భారత ఎగుమతులు మూడు రెట్లు పెరిగాయని, మొబైల్ ఫోన్ తయారీ రంగంలో దేశం ప్రపంచంలో రెండో అతిపెద్ద కేంద్రంగా అవతరించిందని తెలిపారు. అదే సమయంలో సుమారు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరుతున్నాయని వివరించారు.

పేదల సంక్షేమం, ఆర్థిక సమ్మిళితంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, కోట్లాది కుటుంబాలకు శాశ్వత గృహాలు, బ్యాంకు ఖాతాలు అందుబాటులోకి వచ్చాయని మోడీ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్, ఇంటర్నెట్, డిజిటల్ సేవల విస్తరణతో జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ఆధార్, డిజిటల్ హెల్త్ ఐడీలు, యూపీఐ వంటి డిజిటల్ మౌలిక వసతులు ప్రజల జీవితాలను సులభతరం చేశాయని తెలిపారు.

భారత్-ఫ్రాన్స్ సంబంధాలపై మాట్లాడిన ప్రధాని, రెండు దేశాల మధ్య రక్షణ, అంతరిక్షం, కృత్రిమ మేధస్సు, స్వచ్ఛ ఇంధనం, డిజిటల్ టెక్నాలజీ, స్టార్టప్‌ల రంగాల్లో సహకారం మరింత విస్తరిస్తోందని చెప్పారు. ఈ భాగస్వామ్యం భవిష్యత్తులో ప్రపంచానికి కొత్త అవకాశాలు, వినూత్న పరిష్కారాలను అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి పేజీ తరువాయి

## : డిప్యూటీ సీఎం భట్టి

మైనార్టీ సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని భట్టి సూచించారు. ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సాహిత్య, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ముషాయిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే ప్రధాన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం 20 పాఠశాలల నిర్మాణం పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని భట్టి ఆదేశించారు.

మైనార్టీ యువత ఆర్థికంగా బలోపేతం కావడానికి 'రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా స్వయం ఉపాధికి ఆర్థిక సహాయం అందించనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. క్రిస్టియన్, ఇతర మైనార్టీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూ.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులను ఆర్థిక ప్రోత్సాహక కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు చెప్పారు.

వక్ఫ్ బోర్డుకు చెందిన భూముల రక్షణకు చట్టపరమైన చర్యలను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించిన భట్టి, ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో స్మశాన వాటికల కోసం స్థలాల సేకరణ, ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'ప్రపంచం సురక్షితం.. చమురు మళ్లీ ప్రవహిస్తోంది'




పారిస్/వాషింగ్టన్: అమెరికా-ఇరాన్ అవగాహన ఒప్పందం అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో కీలక వ్యాఖ్యలు చేశారు. చమురు సరఫరాలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయని, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను కలిగి ఉండదని పేర్కొంటూ ప్రపంచం మరింత సురక్షితంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. అమెరికా ఆర్థిక పరిస్థితిపై కూడా ట్రంప్ ఆశావహంగా స్పందించారు. స్టాక్ మార్కెట్లు బలంగా దూసుకుపోతున్నాయని, ఉద్యోగాల సంఖ్య రికార్డు స్థాయిలో ఉందని, ధరలు తగ్గుముఖం పట్టడంతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతోందని తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా గతంలో ఎన్నడూ లేనంత బలంగా, సురక్షితంగా, ప్రపంచవ్యాప్తంగా గౌరవనీయమైన దేశంగా మారిందని వ్యాఖ్యానించారు.

ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడం, హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణాను పునరుద్ధరించడం, ఇరాన్ అణు కార్యక్రమంపై తదుపరి చర్చలకు మార్గం సుగమం చేయడం ఈ అవగాహనలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. అయితే ఇది తుది ఒప్పందం కాకుండా తదుపరి చర్చలకు ప్రారంభ దశ మాత్రమేనని అంతర్జాతీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఒప్పందం అమలు ఇరు దేశాల సహకారంపై ఆధారపడి ఉంటుందని, భవిష్యత్ చర్చల ఫలితాలపై తుది పరిణామాలు ఆధారపడనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ట్రంప్ చేసిన ఆర్థిక, ఇంధన రంగాలకు సంబంధించిన వ్యాఖ్యలపై అధికారిక గణాంకాల ఆధారంగా పూర్తి అంచనాలు వెలువడాల్సి ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# 'కేటీఆర్ వీకెండ్ ఎమ్మెల్యే'..

మొదటి పేజీ తరువాయి

## సిరిసిల్లలో కవిత విమర్శలు

సిరిసిల్ల నియోజకవర్గంలో పరిమిత విస్తీర్ణానికే సాగునీరు అందుతోందని, వేములవాడలోనూ వేలాది ఎకరాలు ఇంకా నీటి కోసం ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ప్రకటించిన 'వర్కర్ టు ఓనర్' పథకం అమలుపై కూడా ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. సిరిసిల్ల కార్మికుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. నెరేళ్ల ఘటనలో దళితులు, బీసీలకు ఇప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని, బాధితులకు సహాయం చేస్తామని చెప్పిన నాయకులు హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు.

తమ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి, రూ.2 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందించే విధానాన్ని అమలు చేస్తామని కవిత హామీ ఇచ్చారు.

# ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్/అమరావతి: ఆంధ్రప్రదేశ్ లిక్కర్ రవాణా అక్రమాల కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో కీలక ముందడుగు వేసింది. ఈ కేసులో నిందితుడిగా విచారణ ఎదుర్కొంటున్న కారుమూరి సునీల్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు నిర్వహించిన ఈడీ అధికారులు, అనంతరం ఆయనను ప్రత్యేక ఈడీ కోర్టులో హాజరుపర్చేందుకు నాంపల్లికి తరలించారు.

ఈ కేసులో ఇప్పటికే మాజీ ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, రాజ్ కేసిరెడ్డిలను అరెస్ట్ చేసిన ఈడీ, తాజా అరెస్టుతో దర్యాప్తును మరింత విస్తరించింది. లిక్కర్ రవాణా కాంట్రాక్టుల కేటాయింపులో భారీ స్థాయిలో ఆర్థిక అవకతవకలు జరిగినట్లు విచారణలో గుర్తించినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది.

ప్రాథమిక విచారణలో వెలుగుచూసిన వివరాల ప్రకారం, రవాణా ఒప్పందాల అమలులో సుమారు రూ.195.33 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఈడీ అనుమానిస్తోంది. జిల్లా స్థాయిలో అమలులో ఉన్న రవాణా చార్జీలను గణనీయంగా పెంచడం ద్వారా అక్రమ లాభాలు పొందినట్లు, అలాగే రాజకీయ నాయకులు, వారి అనుబంధ వ్యక్తులు, సంస్థలకు సబ్ కాంట్రాక్టులు కేటాయించే వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం.

దర్యాప్తు సంస్థ ఆరోపణల ప్రకారం, అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించినట్లు భావిస్తున్నారు. అమల్లో ఉన్న జిల్లా స్థాయి రవాణా విధానాన్ని పక్కనపెట్టి, ప్రభుత్వ అనుమతి లేకుండానే రాష్ట్రవ్యాప్తంగా కేంద్రీకృత రవాణా విధానాన్ని అమలు చేసినట్లు విచారణలో తేలినట్లు అధికారులు చెబుతున్నారు.

మనీలాండరింగ్ కోణంలోనూ ఈ కేసును ఈడీ పరిశీలిస్తోంది. తాజా అరెస్టుతో కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని, రానున్న రోజుల్లో మరిన్ని కీలక పరిణామాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# రాయదుర్గం భూముల వేలానికి హైకోర్టు బ్రేక్

## ఎస్‌బీఐ పిటిషన్‌పై మూడు వారాల స్టే.. ప్రతివాదులకు నోటీసులు



హైదరాబాద్: రాయదుర్గంలోని టీజీఐఐసీ నిర్వహించిన భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా నిలుపుదల విధించింది. సర్వే నంబర్ 83/1లో ఇటీవల జరిగిన వేలం ప్రక్రియపై మూడు వారాల పాటు స్టే మంజూరు చేస్తూ, ఎస్‌బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది.

సదరు భూమిపై తమకే చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయని పేర్కొంటూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. వేలం నోటిఫికేషన్‌తో పాటు అనంతరం జరిగిన భూ విక్రయ ప్రక్రియను, తమ అభ్యర్థనను తిరస్కరిస్తూ జారీ చేసిన అధికారిక ఉత్తర్వులను సవాల్ చేస్తూ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై ప్రాథమిక విచారణ చేపట్టిన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఇటీవల జరిగిన ఈ-వేలంలో రాయదుర్గం ప్రాంతంలోని భూమికి ఎకరానికి రూ.237 కోట్ల అత్యధిక ధర నమోదవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే భూమిలో ఐదు ఎకరాలపై తమ హక్కులను ఎస్‌బీఐ కోర్టు ముందు ప్రస్తావించింది.

కోర్టులో సమర్పించిన వివరాల ప్రకారం, 2010లో అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌కు ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించగా, ఇందుకోసం బ్యాంకు రూ.13.33 కోట్లు చెల్లించింది. అనంతరం ఎస్‌బీహెచ్ ఎస్‌బీఐలో విలీనమైన తర్వాత కూడా ఆ స్థలంలో బ్యాంకు కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు పేర్కొంది.

అయితే 2020లో అప్పటి ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయడంతో ఎస్‌బీఐ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఆ సందర్భంగా కేటాయింపు రద్దు నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని హైకోర్టు సూచించింది. అనంతరం 2024లో మరోసారి భూకేటాయింపును రద్దు చేయడంతో ఎస్‌బీఐ తిరిగి హైకోర్టును ఆశ్రయించింది. తాజా విచారణలో కోర్టు మధ్యంతర స్టే ఇవ్వడంతో తదుపరి విచారణ వరకు వేలం ప్రక్రియ నిలిచిపోయింది.

# తెలంగాణలో రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్.. ప్రభుత్వం కీలక ప్రకటన..




తెలంగాణ రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. సర్వర్ అప్‌గ్రేడేషన్ మరియు నిర్వహణ పనుల కారణంగా జూన్ 26 నుంచి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. శాఖ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన సాంకేతిక పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మూడు రోజుల వ్యవధిలో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ మరియు కార్యాలయ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు.

ఐదేళ్ల తర్వాత ఈ స్థాయి సర్వర్ అప్‌గ్రేడేషన్ చేపడుతున్నామని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. ఈ అప్‌గ్రేడేషన్ పూర్తయిన తర్వాత సేవల భద్రత, వేగం మరియు పనితీరు మరింత మెరుగుపడుతాయని తెలిపారు. భవిష్యత్తులో వినియోగదారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రజలు, రిజిస్ట్రేషన్ సేవలు వినియోగించుకునే వారు ముందస్తుగా తమ పనులను ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు. అత్యవసర రిజిస్ట్రేషన్ అవసరాలు ఉన్నవారు జూన్ 26కు ముందుగానే పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 29 నుంచి అన్ని రిజిస్ట్రేషన్ సేవలను యథావిధిగా పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకువస్తామని ఐజీ తెలిపారు. అప్‌గ్రేడేషన్ అనంతరం సేవలు మరింత సురక్షితంగా, వేగవంతంగా అందుతాయని పేర్కొన్నారు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు..

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్



## ఉమ్మడి రంగారెడ్డి నగర్ డివిజన్ సమస్యల పరిష్కారం కోసం వాటర్ వర్క్స్ అధికారులకు వినతిపత్రం సమర్పించిన విజయ్ శేఖర్ గౌడ్






కుత్బుల్లాపూర్ , 18 జూన్ (కెరటం న్యూస్): పూర్వ ఉమ్మడి రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని కాలనిలలోని ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సరఫరా పెండింగ్ యూజీడీ పనులు డ్రైనేజీ నిర్వహణ సమస్యలపై డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఐడిపిఎల్ లోని వాటర్ వర్క్స్ మేనేజర్ పూజిత, కి వినతిపత్రం సమర్పించి ప్రజలకు సరిపడా పరిమాణంలో సమయానికి మంచి నీటి సరఫరా అందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి సమస్యలు తీర్చాలని కోరిన ఉమ్మడి 127 డివిజన్ మాజీ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్, ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, నాయకురాళ్లు, కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నబోయినపల్లి డి.ఎన్.టీ. యూ.పి.ఎస్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకారం



ములుగు జూన్ 18 (కెరటం న్యూస్)చిన్నబోయినపల్లి గ్రామంలోని డి.ఎన్.టీ. యూ.పి.ఎస్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పాఠశాల భద్రత, విద్యార్థుల రక్షణ దృష్ట్యా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ పనులు ప్రారంభమవడం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక నాయకులు కృషి చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నందుకు గ్రామ ప్రజలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా యువశక్తి యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించిన స్థానిక నాయకులకు మరియు మంత్రి సీతక్క కూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని గ్రామస్తులు

## అంగరంగ వైభవంగా ముగిసిన పోచమ్మ తల్లి బోనాలు

**-గుండుమాల్ గ్రామంలో మూడు రోజుల పండుగ సంబరాలు**



నారాయణపేట, 18 జూన్ (కెరటం న్యూస్): గుండుమాల్ మండల కేంద్రంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. గ్రామ ఆడపడుచులు, మహిళలు, పెద్దలు, చిన్నలు కలిసి ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా నూతన పోచమ్మ తల్లి గుడి ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట మరియు నాబి శిలా బొడ్రాల స్థాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ శ్రీశైలమ్మ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల పర్యవేక్షణలో ఈ వేడుకలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. మూడవ రోజు పోచమ్మ తల్లికి భారీగా బోనాలు సమర్పించారు. డప్పు వాయిద్యాల నడుమ జరిగిన ఈ కార్యక్రమం



ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు వేయికి పైగా గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొని పండుగను దిగ్విజయంగా ముగించారు. గ్రామ ఆడపడుచుల రాకతో గుండుమాల్ గ్రామం కొత్త కళ తో ఉత్సాహభరితంగా మారింది. కార్యక్రమం సజావుగా జరగడానికి సహకరించిన గ్రామ పెద్దలు, యువకులు, సీనియర్ నాయకులు, వార్డు సభ్యులకు సర్పంచ్ శ్రీశైలమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోచమ్మ తల్లి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో గ్రామ దేవతగా పూజించబడుతుంది. ఆమెను రోగాల నివారణకారిణిగా, గ్రామ రక్షకురాలిగా భావిస్తారు. గ్రామంలో శాంతి, ఆరోగ్యం, సుఖసంతోషాలు కలగాలని భక్తులు ప్రార్థిస్తారు.

బోనాల పండుగ విశిష్టత: బోనాలు అనేది అమ్మవారికి కృతజ్ఞతగా సమర్పించే పండుగ. మహిళలు అలంకరించిన కుండల్లో అన్నం, పాలు, బెల్లం వంటి నైవేద్యాలు తీసుకువెళ్లి దేవతకు సమర్పిస్తారు. ఇది భక్తి, సంప్రదాయం, ఐక్యతకు ప్రతీకగా భావించబడుతుంది.


నాబి శిలా బొడ్రాలు గ్రామ రక్షణకు సంకేతంగా స్థాపించబడే పవిత్ర శిలలు. వీటిని గ్రామ కేంద్రం లేదా దేవాలయం సమీపంలో ప్రతిష్టించి, చెడు శక్తులు దూరంగా ఉండాలని విశ్వసిస్తారు. గ్రామ ఐక్యతకు ఇవి ఒక ప్రతీకగా కూడా భావించబడతాయి. గుండుమాల్ గ్రామంలో జరిగిన ఈ మూడు రోజుల పోచమ్మ తల్లి బోనాల పండుగ భక్తి, సంప్రదాయం, ఐక్యతను ప్రతిబింబిస్తూ ఘన విజయంగా నిలిచింది.

## ఉప్పుగల్‌లో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

### రజక కాలనీ నుంచి గ్రామపంచాయతీ వరకు కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్య నివారణ



జాఫర్‌గఢ్, 18 జూన్ (కెరటం న్యూస్): ఉప్పుగల్ గ్రామంలోని రజక కాలనీ నుంచి నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.గత కొంతకాలంగా విద్యుత్ తీగలు కిందకు వంగి ఉండటంతో ఆ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోయేది.దీంతో రజక కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు గంటల తరబడి చీకట్లో గడపాల్సిన పరిస్థితి ఏర్పడేది.ఈ సమస్య కారణంగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా రాత్రి సమయాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో చిన్నారులు,వృద్ధులు,మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతుండేవారు.భారీ వాహనాలు వెళ్లే సమయంలో విద్యుత్ తీగలు తగిలే ప్రమాదం ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.ఈ నేపథ్యంలో రజక కాలనీ నుంచి గ్రామపంచాయతీ మధ్య ప్రాంతానికి చెందిన కాలనీవాసులు తమ సమస్యను గ్రామ సర్పంచ్ కొడారి సాంబరాజు దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల సమస్యను వెంటనే గుర్తించిన సర్పంచ్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు.అధికారులు స్పందించి విద్యుత్ సిబ్బందితో



కలిసి కిందకు వంగిన తీగలను సరిచేసి,అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో సమస్యకు పరిష్కారం లభించింది.దీంతో గత కొన్ని రోజులుగా విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన చర్యలు చేపట్టిన గ్రామ సర్పంచ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారంలో గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని, గ్రామాభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

## కరెంట్ షాక్‌తో మేక మృతి



తొర్రూరు, 18 జూన్ (కెరటం న్యూస్): తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలో కరెంట్ షాక్‌కు గురై ఓ మేక మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొర్ల కాపరి జంగిడి కుమార్‌కు చెందిన మేక మేత మేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగను తాకడంతో తీవ్రంగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో బాధిత గొర్రెల కాపరి ఆర్థికంగా నష్టపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మేతకు వెళ్లిన మేక ప్రాణాలు కోల్పోవడంతో యజమాని జంగిడి కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## పదవ తరగతి విద్యార్థులకు

### ప్రతిభ పునస్కారాలు అవార్డు ప్రధానం



పెన్ పహాడ్, 18 జూన్ (కెరటం న్యూస్): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2025-26 విద్యాసంవత్సరంలో ఎస్ ఎస్ ఎస్ సి పరీక్షాలలో ఉత్తమ ప్రతిభ సాధించిన 26 మంది విద్యార్థులకు ప్రగతి పురస్కారం అవార్డును మన అమ్మ హాస్పిటల్ డాక్టర్ దాచేపల్లి సుధీర్ కుమార్ , స్వరూప లక్ష్మి,దొంగరి సురేష్, బహుమతులను అందించారు. మండలంలోని 11 పాఠశాలలోని ఇద్దరు చొప్పున మొత్తం 26 మందికి షీల్డ్ నగదు బహుమతులను అందించారు, మండల స్థాయి టాపర్ కు ప్రత్యేక నగదు బహుమతి నిఇద్దరికీ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేను ప్రభుత్వ బడిలోనే చదివాను డాక్టర్ అయ్యాను విద్యార్థులంతా చదువుకొని ఉన్నత శిఖరాలను ఎదగాలని ఆకాంక్షించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం, భగత్ సింగ్ గా భారతదేశానికి దేశభక్తి తో ఉండాలని విద్యార్థులకు చెప్పారు, ఈ కార్యక్రమంలో ఎంఈఓ నకిరేకంటి రవి, నోడల్ అధికారి వస్త్రం నాయక్, ప్రోగ్రాం సమన్వయకర్త సంధ్యాల వినోద్, ప్రధానోపాధ్యాయులు అంజయ్య, రవీందర్ బాబు, ఉపేందర్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ లోని వ్యవసాయ శాఖ అధికారులతో ఎరువుల సరఫరా పై సమీక్ష నిర్వహణ.



మహబూబాబాద్, 18 జూన్ (కెరటం న్యూస్): ఎరువుల పంపిణీ విషయంలో సమీక్ష నిర్వహనకు ఇంచార్జి అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ పురుషోత్తం హాజరై వ్యవసాయ శాఖ ఏవోలు మరియు ఏఈఓ లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత సీజన్లో యూరియా సరఫరా లో జరిగిన ఇబ్బందులు మళ్లీ తలెత్తకుండా పకడ్బందీగా యూరియా సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న 67 సొసైటీలతోపాటు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 43 రైతువేదికలను ఎంపిక చేసి వాటి ద్వారా కూడా యూరియా సరఫరా చేయబోతున్నామని తెలిపారు. యూరియా యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలని ఏఈఓ లను ఆదేశించారు. ముందుగానే మండలాల వారీగా యూరియా ఎంత అవసరమో ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రణాళిక బద్దంగా యూరియా సరఫరా చేయాలని అధికారులను కోరారు.ఎప్పటికప్పుడు యూరియా నిలవలను పర్యవేక్షించుకుంటూ ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా సరఫరా చేయాలని అన్నారు. గ్రామాలలో నిగ్రాని సమితి లను యాక్టివేట్ చేసి యూరియా తప్పు దోవ పట్టకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సొసైటీ సీఈవోలు వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని యూరియా సరఫరాలో ఇబ్బందుల తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయచంద్ర జిల్లా సహకార అధికారి విజయ కుమారి ఏడీఏలు శ్రీనివాసరావు శ్రీదేవి అన్ని మండలాల ఏవోలు మరియు సొసైటీ సీఈవోలు పాల్గొన్నారు.


## జిల్లాలో ఘనంగా ప్రారంభమైన వన మహోత్సవం కార్యక్రమం

**43.లక్షల 51వేల మొక్కల జిల్లా లక్ష్యం చేరుటకు పక్కా ప్రణాళిక**




మహబూబాబాద్, 18 జూన్ (కెరటం న్యూస్): వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్క నాటి నీరుపోసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డిఎఫ్ఓ విశాల్ బత్తుల సమక్షంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జామండ్లపల్లిలో వన మహోత్సవం ప్రారంభం సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎస్పీ డాక్టర్ శబరిష్, డిఎఫ్ఓ విశాల్ బత్తుల, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, లు మొక్కలు నాటి నీరు పోశారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన మొక్కల లక్ష్యాలను చేరుకోవాలని పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు, జిల్లాలో శాఖల వారీగా వన మహోత్సవం లక్ష్యాలు వ్యవసాయ 1లక్ష, 60 వేల మొక్కలు, బీసీ వెల్ఫేర్ 5వేలు, పంచాయతీరాజ్ 30 వేలు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 31 లక్ష 40 వేలు , ఎక్సైజ్ 60 వేలు, ఫారెస్ట్ 4. లక్షల 50 వేలు, మెడికల్ అండ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ 5 వేలు, హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ 1 లక్ష 30 వేలు, పరిశ్రమల శాఖ 7 వేలు, ఇంటర్ కాలేజ్ ఎడ్యుకేషన్ 3 వేలు, ఇరిగేషన్ 11 వేలు, మైనారిటీ వెల్ఫేర్ 5 వేలు, మున్సిపల్ అథారిటీస్ 2. లక్షల 50 వేలు, పోలీస్ 60 వేలు, రోడ్లు భవనాల శాఖ 10 వేలు, పాఠశాల విద్యాశాఖ 15 వేలు, గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ 10 వేలు, మొత్తం 43 లక్షల 51 వేల మొక్కల లక్ష్యం పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు, నాటిన మొక్కల పెంపకం సంరక్షణలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ట్రీ గార్డ్, రక్షణ ఏర్పాట్లు చేయాలని, సమయానికి నీరు అందించాలని, ఎవెన్యూ ప్లాంటేషన్, మంకీ ఫుడ్ ప్లాంట్స్ ఏర్పాటు చేసి పండ్ల మొక్కలను నాటాలని, ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ పరిధిలో డిమాండ్కు అనుగుణంగా మొక్కలను పెంపకం చేపట్టి వెంటనే అందించాలని, సూచించారు. ఈ వన మహోత్సవం కార్యక్రమంలో ఫారెస్ట్ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా హార్టికల్చర్ అధికారి జినుగు మరియాన్న, ఫారెస్ట్ రేంజర్ అధికారి సురేష్, స్థానిక కౌన్సిలర్లు రజిత, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గాలి వానకు ఎగిరిపోయిన రేకులు





పెన్ పహాడ్, 18 జూన్ (కెరటం న్యూస్): మండల పరిధిలో గురువారం వచ్చిన గాలి వానకు నాగులు పహాడ్ గ్రామంలో ఒగ్గు మిన్నయ్య తండ్రి సత్తయ్య, ఒగ్గు మిన్నయ్య భార్య ఎల్లమ్మ, కుమారుడు ఒగ్గు రవి ఇదే ఇంటిలో నివసిస్తున్నాడు రవికిముగ్గురు ఆడపిల్లలు వీరిద్దరూ రెండు కుటుంబాలు ఒక ఇంట్లోనే ఉంటున్నారు గాలి వానకు వాళ్ళ ఇంటిపై కప్పు రేకులు లేచిపోయి దూరంగా పడ్డాయి, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

# ఎదురులేని భారత్.. హ్యాట్రిక్ కొట్టిన అమ్మాయిలు



స్పోర్ట్స్ న్యూస్, 18 జూన్ (కెరటం న్యూస్): న్యూజిలాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత మహిళల హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. టోర్నీలో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన తమ చివరి గ్రూపు మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3-2 తేడాతో గెలుపొందింది. ఇరు జట్ల మధ్య ఆసక్తికరంగా సాగింది. గేములో ఉరుగ్వేదే తొలి గోల్. ఆ జట్టు తరపున 13వ నిమిషంలో కియారా అపెన్నినో గోల్ చేసింది. ఆ తర్వాత భారత్ బలంగా పుంజుకుంది. 24వ నిమిషంలో దీపిక సెహ్రావత్ గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేసింది. అనంతరం 43వ నిమిషంలో దీపిక సోరెంగ్ చేసిన గోల్‌తో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక, ఆట చివర్లో మ్యాచ్ రసవత్తరంగా మారింది. 55వ నిమిషంలో ఉరుగ్వే గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేయడంతో అందరిలోని ఉత్కంఠ నెలకొంది. ఈ పరిస్థితుల్లో దీపిక సెహ్రావత్ అద్భుతమైన గోల్ చేసింది. 56వ నిమిషంలో తన నుంచి రెండో గోల్ చేసి భారత్‌ను 3-2తో ఆధిక్యంలోకి తీసుకెళ్లింది. ఇక మిగతా సమయంలో ఉరుగ్వే మరో గోల్ చేయకపోవడంతో ఇండియా విజయం సాధించింది. ఈ మ్యాచ్‌కు ముందు భారత జట్టు.. అమెరికా, జపాన్‌లను మట్టికరిపించింది. దీంతో గ్రూపు దశను అజేయంగా ముగించిన భారత్ ఇప్పటికే సెమీస్‌కు దూసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నెల 20న చిలీతో సెమీస్‌లో భారత్ తలపడనుంది.

# ఐపీఎల్-2027పై కీలక అప్‌డేట్ ఇచ్చిన బీసీసీఐ సెక్రెటరీ



స్పోర్ట్స్ న్యూస్, 18 జూన్ (కెరటం న్యూస్): వచ్చే ఏడాది జరగబోయే ఐపీఎల్ సీజన్‌ను ముందుగానే నిర్వహించేలా చూస్తున్నామని బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. ఆ దిశగా బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆలోచన చేస్తుందని తెలిపారు. ఆటగాళ్లు, ప్రేక్షకులు ఎదుర్కొనే తీవ్రమైన వేడి, అలాగే మే ద్వితీయార్థంలో మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించకుండా టోర్నీని ముందుకు జరిపేందుకు చర్చలు జరుపుతున్నామని చెప్పారు. 'ఈ ఏడాది మార్చి 28 నుంచి ఐపీఎల్ మొదలైంది. మే 31కు ముగిసింది. మే 15 తర్వాత వర్షాలు కురిసే అవకాశం ఉంది. మేము దాని గురించి ప్రధానంగా చర్చిస్తున్నాం. మరో విషయం తీవ్రమైన వేడి. వేడి వాతావరణం ప్లేయర్లకు, ప్రేక్షకులకు అనుకూలంగా లేదు.అభిమానులే కాకుండా ప్లేయర్ల నుంచి కూడా చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇంత వేడిలో ఆడటానికి ప్లేయర్లు సిద్ధంగా లేరు. అందువల్ల మార్చి నెలాఖరు కంటే కొంచెం ముందుగానే టోర్నీని ప్రారంభించవచ్చా? అనే విషయం గురించి బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో చర్చ జరుగుతుంది.'అని సైకియా తెలిపారు.

అంతేకాకుండా వచ్చే ఏడాది మారి 10 నుంచి మే 15 వరకు టోర్నీని నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నట్టు వెల్లడించారు. 'మార్చి 10న టోర్నీని ప్రారంభించి మే 15న ముగించేలా విండో చూడాలని మా జనరల్ మేనేజర్‌కు నేను సూచించాను. తద్వారా ఐపీఎల్-2027 ప్లే ఆఫ్స్, ఫైనల్ ఎలాంటి ప్రతికూల వాతావరణం తలెత్తకుండా జరుగుతాయి.'అని సైకియా తెలిపారు. అలాగే, వచ్చే ఏడాది లీగ్ దశ విస్తరణను సైకియా కొట్టిపారేశారు. అది తక్షణమే సాధ్యం కాదన్నారు. 74 మ్యాచ్‌ల నుంచి 94 గేములకు మార్చాలనే విషయంపై ఎలాంటి చర్చ జరగలేదని చెప్పారు. మ్యాచ్‌ల సంఖ్య పెంపుపై టీమిండియానే కాకుండా ఐసీసీలోని ఇతర క్రికెట్ దేశాల ప్రయోజనాలను దృష్టి పెట్టుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 'ముఖ్యంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, వెస్టిండీస్ దేశాల ప్రయోజనాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. మేము ద్వైపాక్షిక మ్యాచ్‌లు, బహుల దేశాల టోర్నమెంట్‌లకు ఆటంకం కలిగించాలనుకోవడం లేదు.'అని సైకియా తెలిపారు.




# ప్రేక్షకుల ముందుకు మరో తెలుగు కథానాయిక

జానపద పాటల్లో నటించి మెప్పించి యువతకు దగ్గరైన నటి నాగ దుర్గ. యూట్యూబ్ వేదికగా ఆమె చేసిన ఆల్బమ్స్ సూపర్‌హిట్ అయ్యాయి. ఇటీవల తమిళంలో 'లవ్ ఓ లవ్' మూవీ చేస్తున్న ఆమె ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. వంశీరెడ్డి దర్శకత్వంలో ప్రియదర్శి కథానాయకుడిగా ఓ మూవీ పట్టాలెక్కనుంది. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ కథలో నాగదుర్గ కథానాయికగా ఎంపికైంది. సుకుమార్, బన్నీ వాస్‌లు నిర్మిస్తున్న ఈ మూవీ ఈ నెల 25వ తేదీన ప్రారంభం కానుంది. జులై నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది.



# 'డియర్ అమ్మ' షార్ట్ ఫిల్మ్ బృందానికి గడ్డం నవీన్ ప్రత్యేక శుభాకాంక్షలు



తల్లి ప్రేమ నేపథ్యంలో ఎంతో భావోద్వేగంగా, హృద్యంగా తెరకెక్కిన 'డియర్ అమ్మ' షార్ట్ ఫిల్మ్ బృందానికి శ్రీ గడ్డం నవీన్ గారు తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "అమ్మ గొప్పదనాన్ని, ఆమె ప్రేమను నేటి తరానికి చాటిచెప్పేలా ఇలాంటి చక్కటి సందేశాత్మక చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా నిర్మించిన నిర్మాత గణేష్ భారీ గారికి నా ప్రత్యేక అభినందనలు. అలాగే ఈ కథను ఎంతో సహజంగా, ప్రతి ఒక్కరి మనసుకు హత్తుకునేలా అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు రామ్ దాస్ భీమ్ పాగా గారి పనితీరు నిజంగా ప్రశంసనీయం. నటీనటుల నటన, సాంకేతిక నిపుణుల కృషి ఈ షార్ట్ ఫిల్మ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి," అని చిత్ర యూనిట్‌ను కొనియాడారు.

ఈ 'డియర్ అమ్మ' షార్ట్ ఫిల్మ్ యూట్యూబ్ మరియు ఇతర మాధ్యమాలలో విశేష ఆదరణ పొంది, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్ట్ విజయంతో నిర్మాత గణేష్ భారీ, దర్శకుడు రామ్ దాస్ భీమ్ పాగా భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో అద్భుతమైన చిత్రాలు చేయాలని, వారికి మరింత మంచి పేరు రావాలని గడ్డం నవీన్ గారు మనస్ఫూర్తిగా కోరుకున్నారు.



# పనోరమా స్టూడియోస్‌తో ఫహద్ ఫాసిల్ రెండు కొత్త చిత్రాలు



హైదరాబాద్: మలయాళ స్టార్ నటుడు ఫహద్ ఫాసిల్ వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతున్నారు. 'దృశ్యం' ఫ్రాంచైజీని నిర్మించిన పనోరమా స్టూడియోస్, నిర్మాత జాకబ్ బాబుతో కలిసి రెండు కొత్త ఫీచర్ చిత్రాలను నిర్మించనున్నట్లు ప్రకటించింది. ఈ రెండు చిత్రాల్లోనూ ఫహద్ ఫాసిల్ కథానాయకుడిగా నటించనున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమాలను వచ్చే ఏడాది విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు.

ఈ సందర్భంగా ఫహద్ ఫాసిల్ మాట్లాడుతూ, కథలు నచ్చడంతోనే ఈ ప్రాజెక్టులకు అంగీకరించానని చెప్పారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే విభిన్న కథల్లో నటించడం తనకు ఎప్పుడూ ఆసక్తికరమని పేర్కొన్నారు.

పనోరమా స్టూడియోస్ ప్రతినిధులు కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ కూడా ఫహద్ ఫాసిల్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని తెలిపారు. భాషలకు అతీతంగా ప్రేక్షకులను ఆకట్టుకునే నటుడిగా ఆయనను ప్రశంసించారు. దర్శకులు, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది.